# సర్వజిత్



"సంబడం.... ఇందుకు మాత్రం ఏం తక్కువ లేదు..." అంటూ భర్త తనమీద వేసిన చేతిని విసురుగా తీసేసి కొంచెం దూరంగా జరిగింది జానకి. "ఇవ్వుడే మయ్యిందీ....?" లాలనగా అంటూ మంచం మీద ఆమెకు దగ్గరగా జరుగుతూ మళ్ళీ భార్య మీద చెయ్యి వేయబోయాడు సీతారాముడు.

ఈసారీ ఆమె విసిరి కొట్టింది.

"అబ్బ.... ఇంత మోటు సరసమా?" భార్యని మురిపిద్దామని జోక్‌గా అన్నాడు.

"సరసమా? అందులోనూ మోటు సరసం కూడానా? అదొక్కటే తక్కువ నా బతుక్కి" ఇటు తిరిగి గయ్‌మని అనేసి, మళ్ళీ అటు తిరిగి పడుకున్నది జానకి. "అసలేమయ్యింది? నువ్వలా మూతి బిడాయించుకుని పడుకుంటే నాకెలా తెలుస్తుంది..." అనునయంగా అంటూ భార్యను తనవైపు తిప్పుకోబోయాడు సీతారాముడు.

అతని చేతులు విసిరికొట్టి, మంచం చివరికంటూ జరిగి పడుకున్నది.

"కోపం సరే !..... మరీ చివరికెళితే కింద పడతావ్...." సీతారాముడు అన్నాడు.

"పడితే పడనివ్వండి... ఏకాలో,చెయ్యో విరిగితే మూలన పడి ఉండచ్చు. ఇప్పుడు మాత్రం ఏం ఉంది కనక.... ఓ అచ్చటా ముచ్చటానా?!"

"ఇదిగో ఆ సతాయింపే వద్దు... అసలు విషయం ఏమిటో చెప్పు జానకీ...."

"అవును మరి.... నాది సతాయింపే.... కాపురానికొచ్చిం దగ్గర్నుంచీ మిమ్మల్ని రాచి రంపాన పెట్టేస్తున్నాగా నేను...."

"ఇదిగో.... నువ్వు ఏవేవేవో అర్థాలు చేసేసుకుని... ఏవేవో ఊహించేసుకుని...."

"ఏం చేస్తాను మరీ ! ఇంటరు జిడ్డు మొహాన్ని కదా! మీ మాటలు నాకేం అర్ధమవుతాయి?!"

"అబ్బా జానకీ... నే అన్నది అది కాదు...."

"అదేలెండి మీరన్నది అర్ధం చేసుకోలేని వెర్రిదాన్ని కదా !"

"జానకీ నా ఉద్దేశ్యం..."

"మీ ఉద్దేశ్యాలకేం మహాబాగు! ఎటొచ్చీ నేనే పిచ్చి ముండని... మీ అమ్మ నొచ్చుకోకూడదు...మీ అక్క నొచ్చుకోకూడదు. ఆఖరికి మీ వాళ్లందరిలో మీరు అపర శ్రీరామచంద్రుడిలా వెలిగిపోవాలి... నేను మాత్రం గయ్యాళిలా మిగిలిపోవాలి...."

"ఛ ! ఛ ! జానకీ నేనెప్పుడైనా నిన్ను గయ్యాళి అన్నానా ?"

"................"అంతెందుకు..... నువ్వడిగింది నేనేం కాదన్నాను చెప్పు

"అడిగిన వెంటనే కాకపోయినా నీ కోర్కె తీరుస్తూ వస్తున్నానుగా...."

"అవును చాలా తీర్చేశారు మరి"

"ఆ పుల్లవిరుపు మాటలే వద్దు.... ఏం కాదన్నానో చెప్పు?"అంటూ భార్యని తన వైపు తిప్పుకోబోయాడు. ఆమె విసురుగా అతని చేయి తీసేసింది.

"అప్పుడు మా అక్క కొడుకు పెళ్ళికి పట్టు చీర కొనుక్కుంటానంటే వద్దన్నారుగా...." కాస్సేపయ్యాక ఆమె అడిగింది నిష్ఠూరంగా. "ఎప్పటి మాట అదీ... ఏణ్ణర్ధం కిందటి సంగతా?!" సీతారాముడు ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును ! ఏణ్ణర్ధం కిందటి మాటే.... నువ్వడిగింది నేనేం కాదన్నాను అని ఇందాకా సాగదీసి మరీ అడిగారుగా..."

సీతారాముడు సమాధానం వెతుక్కుం టుంటే మళ్లీ ఆమే అన్నది దెప్పి పొడుపుగా !

" మా వాళ్లంతా ఆ పెళ్లిలో కొత్త పట్టు చీరలు కొనుక్కుని కట్టుకుంటుంటే మా అక్క కూతురు తన కొత్త పట్టు చీరిచ్చి కట్టుకో పిన్నీ అంటే నాకు చచ్చే చావయ్యింది...."

"నేనంత సీరియస్‌గా ఆలోచించలేదు జానకీ. నీకు మంచి చీరలు ఉన్నాయి కదాని వద్దన్నాను అంతే !" నొచ్చుకున్నట్లే అన్నాడు సీతారాముడు.

" నా విషయం వచ్చేసరికి అంతే మరి. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతానికి మీ అక్కకి చీర కొనిపెట్టారు. మళ్లీ నెల్లాళ్ళకే వాళ్ల వెడ్డింగ్‌డే అని మీ అమ్మ చీర కొనమంది. కొన్నారు. ఏభయ్యో, వందో ఇస్తే సరిపొయ్యేదిగా?"

సీతారాముడికి మళ్లీ సమాధానం దొరకలేదు.

"ఇంటి ఆడపడుచు. ఆమెకు ఇవ్వాలను కున్నదేదో ఇవ్వండి. నేను కాదనను. కానీ నా వరకు వచ్చేసరికి మీరు నీళ్లు నములుతారు. అక్కడే నాకు వళ్లు మండేది....."

క్షణంసేపు ఆగింది. భర్త ముఖంలోకి ఓరకంటితో చూసింది.

సీతారాముడు ఆమెనే చూస్తున్నాడు.

"మా అన్న కూతురు పెళ్లికి వెళ్లాలనీ, నా నెక్లెస్‌కి లాకెట్ వేయించండనీ నోరు అరిగేలా అడిగాను. వేయించారా? ఇవ్వాళ, రేపు అంటూ జరిపేశారు. లాకెట్ వేయిస్తే ఏదో కొత్త నగ చేయించుకున్నానని అంతా అనుకునే వారు.... ఆ పాతనగతోనే పెళ్లికి వెళ్లాను. నా అవస్థ చూడలేక మా చిన్నక్క తన ముత్యాల హారం నా మెళ్లో వేసింది కనుక సరిపోయింది. లేకపోతే ఎంత చిన్న తనంగా ఉండేది ! మీరు మగ మహారాజులు మీకే గోలా లేదు....."

ఇప్పుడూ సీతారాముడికి మాటలు దొరకలేదు. ఆమె చూపులు తప్పించుకునేందుకు ముఖం ఎటో తిప్పుకున్నాడు. "అందుకు మిమ్మల్ని నేనేవన్నా అన్నానా? మా వాళ్లు మిమ్మల్ని చిన్నతనంగా కానీ చూశారా?"

లేదన్నట్లు సీతారాముడు తలూపాడు.

ఈ సంఘటన ఇప్ప టిది కాదు. ఏడాది కిందటిది కదా అనుకున్నాడు. "నేనేమన్నా వడ్డాణాలు, వజ్రాల హారాలు చేయించమన్నానా? నాకా మాత్రం మంచీ చెడూ తెలీదా ఏం....?"

"అలా అని ఎవరన్నారు?" అంటూ ఆమెను దగ్గరికి లాక్కో బోయాడు. ఆమె రాలేదు. అతని చెయ్యి తోసేసింది.

"మా వాళ్లిళ్లల్లో ఏ శుభకార్యం జరిగినా అక్కడ బజారుపనులు, పురమా యింపులు చూసేది నేనని మీకు మాత్రం తెలీదా ఏం..."

"అవును ! తెలుసు"

"ఎందుకని? నేనైతే ఒక్క పైసా కూడా వేస్టు చెయ్యనని వాళ్ల నమ్మకం. ఆఖరికి మా వదిన కూడా నా చేతికే అన్నీ అప్పగిం చేస్తుంది......"

"నాకు తెలుసుగా..." ఆమె చెంపలు నిమరబోయాడు. చెయ్యి విదిలించింది.

"ఏం లాభం... ఈ ఇంట్లో ఒక్క జాకెట్టు ముక్క కూడా స్వతంత్రించి నేను కొనుక్కోవడానికి లేదు.... కనీసం మంచి కాఫీ తాగడానికి కూడా కుదరదు..."

"............."

"మా వాళ్లు చిక్కటి ఫిల్టర్ కాఫీ తాగు తారు. ....చిన్నప్పటినుంచీ నాకూ అదే అలవాటు..... మీ అమ్మ కాఫీ కలిపితే ఓ కాఫీ వాసనా ఉండదు.... కాఫీ రుచీ ఉండదు..... ఎందుకొచ్చిన కాఫీ అది..."


సీతారాముడు ఏమీ మాట్లాడలేక పోయాడు. ఈ విషయంలో భార్య చెప్పిన దాంట్లో అబద్ధం లేదనిపించిందతనికి.

"ఎవరేనా ఇంటికొచ్చినప్పుడు కాస్త మంచి కాఫీ ఇద్దామనుకుంటే.... నువ్వు మాట్లాడుతూ ఉండు.... కాఫీ నేను పెడతా నంటూ మీ అమ్మ హడావిడి పడుతుంది... ఎక్కడ నేను కాఫీ పొడి అవజేసేసి..... పాలు వాడేస్తానోనని.... హు ఆ నీళ్ల కాఫీ చూసి నా ప్రాణం చివుక్కు మనిపోతోంది బాబూ...."

"అదో చాదస్తం లెద్దూ...."

"చాదస్తం కాదు. పొదుపు. అక్కడికి నేనేదో దుబారా చేసేదాన్ని..... ఆవిడ ఒక్కర్తే పొదుపు చేసే మనిషి."

క్షణం ఆగి ఓరకంటితో భర్త ముఖం చూసింది. అతని చూపులు ఆమె శరీరం మీద ఎక్కడో ఉన్నాయి. చేతులు ఎక్కడెక్కడో వేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఆమె పడనివ్వడం లేదు.



అతని చేతులు తోసేస్తోంది.

"అయినా మీ అమ్మని నేనవన్నా అంటే మీకు కోపం కదా !"

ఎప్పుడు ఇటు తిరిగిందో సీతా రాముడు గమనించలేదు గానీ, ఆ మాట అనేసి మళ్లీ అటు తిరిగి పడుకున్నది.

ఆమె దగ్గిరగా జరిగాడు సీతా రాముడు. ఆమెను తన వైపు తిప్పుకోవాలని గట్టిగా ప్రయత్నించాడు సీతారాముడు. ఆమె జలగలా సాగింది. "అబ్బ ! వదలండి ! నాకు చికాగ్గా ఉంది. ఒక మాటు చెబితే వినాలి...." విసుక్కుంది. "ఎందుకట చికాకు?" ఆమె చెవిలో అన్నాడు. "కాదు ! సంబడం.... మీరు నన్ను హంసతూలికా తల్పాల మీద పడుకోబెట్టే స్తున్నారని.....?!"

"నువ్వు అలా మాట్లాడితేనే నాకు కోపం వచ్చేది.... ఫోమ్ బెడ్ కొనమన్నది నువ్వు...."

"ఐడాయి చెప్పకండి నాకు వళ్లు చిర్రెత్తు కొస్తుంది.... మీ అమ్మ బొంత మీద పడుకోలేక పోతోందనీ.... ఈ మంచం మీద పరుపు ఆవిడకిచ్చి,.... ఎక్కడ నేనేడ్చిపోతా నోనని ఫోమ్ బెడ్ కొన్నారు.... నీ కోసమే అని చెబుతారెందుకు గొప్పగా....?"

ఇటువైపు తిరిగి కళ్లు పెద్దవి చేసి విసురుగా అనేసి మళ్లీ అటు తిరిగింది జానకి.

"ప్రతి దానికీ నువ్విలా అర్థాలు తీస్తే నేనేం చెయ్యలేను జానకీ.... మనం ఫోమ్ బెడ్ కొనుక్కున్నాం. ఆ పరుపేం చెయ్యిలి. మా అమ్మ మంచం మీద వేశాను. దానికి వేరేలా ఆలోచిస్తావెందుకు?"

"అవున్లెండి నాకు ఇంకోలా ఆలోచించడం రాదు మరి."

"ఇప్పుడు నేనేమన్నానని అంతగా యిదయిపోతావ్ !"

"అబ్బె ! మీరేవన్నారు..... ఏమీ అనలేదు. నేనే పుల్లవిరుపు మాట్లాడుతున్నాను."

"జానకీ... ఇదంతా ఎందుకు.... ఇలా చూడు.... అసలేం జరిగిందో చెప్పు?" అంటూ ఆమెను తనవైపు తిప్పుకున్నాడు బలవంతంగా.

ఆమె కోపం ప్రదర్శిస్తూ కళ్లు మూసుకునే ఉంది.

తన వంటి మీద అతను మరెక్కడా చెయ్యి వేయడానికి వీల్లేకుండా ముడుచుకుని పడుకుంది.

పగలు తను ఆఫీసుకు వెళ్ళినప్పుడు అత్తాకోడళ్ల మధ్య ఏదో జరిగి ఉంటుందను కున్నాడు సీతారాముడు. తల్లి మామూలుగానే కనిపించింది.

మళ్లీ అదే ప్రశ్న లాలనగా అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. ఆమెను మరీ దగ్గరికి లాక్కుంటూ, చెంపలు నిమురుతూ మళ్లీ అదే ప్రశ్న అడిగాడు.

ఆమె కళ్లు తెరిచి, భర్త ముఖంలోకి చూసి మళ్లీ కళ్లు మూసుకుంది.

" నేను ఇంట్లోనే ఉంటున్నాను. ఇంటిపని, వంటపని, ఇల్లు కడుక్కోవడాలు, అంట్లు తోముకోవడాలు, అన్నీ నేనే చేసుకుంటే సరిపోతుంది...."

ఒక్కొక్కమాటా ఒత్తి పలుకుతూ, సాగ దీస్తూ అన్నది జానకి, భర్తను ఓరకంట చూస్తూ.

సీతారాముడికి అర్థం కాలేదు. టాపిక్ ఎటునుంచి ఎటు మళ్లిందో అతని బుర్రకి చప్పున స్ఫురించలేదు. "అలాగని ఎవరన్నారు?" అనడిగాడు ఏమనాలో తెలీక.

"ఒకళ్లనాలా ఏమిటి?...నిజం అంతే కదా!?"

అప్పటికీ అతనికి అర్థం కాలేదు. "నేను కాపురానికి వచ్చిన దగ్గర్నుంచీ చూస్తున్నాను.... మీ అమ్మ ధోరణేంటో నాకర్థం కాదు. మిక్సీలు, గ్రైండర్లు కొనుక్కున్నదెందుకు? షోకేసుల్లో పెట్టుకోవడానికా? రుబ్బురోల్లో రుబ్బితేనే ఇడ్లీలు, గారెలు బావుంటాయట.... ఇప్పటికి లక్షసార్లన్న దామాట. నాచేత రుబ్బించాలని.... నేనీ ఇంటి కొచ్చిందగ్గర్నుంచీ విశ్వ ప్రయత్నం చేస్తోం దావిడ...అదేతత్త్వమో నాకర్థంకాదు బాబూ..."

క్షణం ఆగి భర్త ముఖంలోకి చూసింది. తన తల్లి ధోరణి అప్పుడప్పుడు అతనికీ చికాగ్గానే అనిపిస్తోంది.

"ఆరునెలల్లో ముగ్గురు పనిమనుషులు మారారు. ఇప్పుడున్న పనమ్మాయినీ పంపిం చెయ్యాలని మీ అమ్మ ఆరాటం....జానకీ చూశావా ఈ కంచం సరిగ్గా వదల్లేదు. అన్నం గిన్నె సరిగ్గా తోమలేదు. ఇలా రోజూ గిన్నో, గరిటో తీసుకొచ్చి చూపించడమే.... చికాకొచ్చే స్తోంది బాబూ ఆవిడ ధోరణికి.... సిటిలో నాలుగిళ్లల్లో పనిచేసే వాళ్లు..... ఎప్పుడో ఏదో పొరపాటు జరుగుతుంది.... ప్రతీదీ భూతద్దం లో చూడ్డమేనా!?"

భర్త వింటున్నాడో లేదోనని క్షణంసేపు ఆగింది.

అతను వింటున్నాడు. విషయమూ కొంచెం కొంచెం అర్థమవుతోందతనికి. "ఇవాళ నాకు మరీ చిరాకెత్తుకొచ్చేసింది. పనమ్మాయిని మానిపిస్తే మానిపించెయ్యమన్నాడు. నేను మాత్రం అంట్లు తోమలేనన్నాను. చాలాసేపు సణిగింది మీ అమ్మ.... సాయంత్రం పనమ్మాయి వచ్చినా ఆ ఛాయలకి రాలేదు... ఇదిగో ముందే చెబుతున్నాను..... నావల్ల కాదు. కాదు బాబూ నెలకో పనమ్మాయిని మాట్లాడ్డం.... దేనికైనా హద్దుండాలి.... సర్దుకుపోవాలి.... అంతే కాని రోజూ ఏమిటీగోల?"

విసుక్కుని మళ్లీ అటు తిరిగి పడుకున్నది జానకి.

భార్య అలకకి మూలం ఏమిటో సీతా రాముడికి అప్పటికి పూర్తిగా బోధపడింది.

ప్రతి రెండు, మూడు నెలలకి తనకీ ఈ సమస్య చికాగ్గానే అనిపిస్తోంది.

'మొత్తం మీద జానకి తక్కువది కాదు. ఎక్కడో ఎత్తుకుని, ఎటెటో తిప్పి ఇక్కడికి ముడి పెట్టిందనుకున్నాడు.

"మా అమ్మకి రేపు నేను గట్టిగా చెబుతాను. దాని గురించి నువ్వు ఇదవకు" అన్నాడు.

ఆమె ఇటువైపు తిరిగింది. కన్నార్ప కుండా భర్తకేసి చూసింది.

"నేను మాట్లాడతాను. మాటిమాటికీ పనిమనిషిని మారిస్తే మనకీ వీధిలో విలువేం ఉంటుంది?" భార్య ధోరణిలోనే అన్నాడు.

ఆమె నడుం మీద చెయ్యి వేసి దగ్గిరకి లాక్కున్నాడు.

ఆమె ఎదురు చెప్పలేదు.